క్లుప్తంగా

దస్తావేజు లేఖరి సంఘం కమిటీ ఎన్నిక



నర్సంపేట : స్థానిక దస్తావేజు లేఖరి సంఘం నూతన కమిటీ పట్టణంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాట శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా చందావత్ తిరుపతి నాయక్, ఉపాధ్యక్షుడిగా ఆరెల్లి వేణు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా దండెం రాజు, కార్యదర్శిగా రుద్ర రాజేశ్, కోశాధికారిగా నన్న నరేశ్, కార్యవర్గ సభ్యులుగా రంపీస ప్రవీణ్, ఆంగోతు ఈరు, మండల శ్రీనివాస్, భూక్య శ్రీనివాస్, బొమ్మ గాని సదానందం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను దస్తావేజు లేఖరిలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సీతారామచంద్ర ఆలయ కమిటీ చైర్మన్‌గా కిరణ్‌రెడ్డి



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని గ్రామంలోని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నల్ల శ్రీనివాసరెడ్డి, మంద చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా జటబోయిన సురేశ్, కోశాధికారిగా పుచ్చకాయల రమణారెడ్డి, సహాయ కార్యదర్శిగా పుట్టపాక రాజేందర్ ఎన్నికయ్యారు. వివిధ కుల సంఘాల నుంచి 30 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్‌రెడ్డి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రమేశ్‌మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నర్సంపేట : పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. పాపయ్యపేటకు చెందిన భూక్య జామ్లా (52) శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుమారుడు స్వామి చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే జామ్లా మృతి చెందాడు. మృతుడి కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్ రెడ్డి తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన పాడిశెట్టి పైడి రాజు (75) మృతదేహానికి ఆయన కుమార్తె తలకొరివి పెట్టింది. స్థానికంగా విషాదం నెలకొల్పిన ఘటన వివరాలిలా.. పైడి రాజు కిడ్నీ సంబంధ సమస్యలతో బాధపడుతూ వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆయన కుమారుడు షాడో 23 ఏళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమారుడు చనిపోయిన క్రమంలో పైడి రాజు మృతదేహానికి కూతురు స్వప్న తలకొరివి పెట్టాల్సి వచ్చింది. పైడి రాజు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

పరామర్శ

ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన దున్నపోతుల వ్యాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం బండమీది మామిండితండాకు చెందిన బోడ తారమ్మ మృతి చెందగా ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు వల్లెపు శ్రీనివాస్, సోమయ్య, కోరె రాము, భూస అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని కుంటపల్లికి చెందిన ఎల్కుర్తి రాజయ్య, ఎల్లూర్ స్టేషన్‌కు చెందిన అమీర్ ఖాన్, తేజావత్ బిక్కి, సపావత్ అనిత, నల్లబెల్లికి చెందిన నీరటి లక్ష్మి, ఎరుకల కొమురమ్మ, అజ్మీర జ్యోతి ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అండగా ఉంటానని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

‘మిరప నాటు’లో జాగ్రత్తలు కీలకం

● కేవీకే మల్యాల కోఆర్డినేటర్ మాలతి



దుగ్గొండి : మిరప సాగు అన్నదాత ఇంట సిరులు కురిపిస్తుందన్న నానుడి తెలిసిందే. గతేడాది ధర తక్కువగా పలికి గిట్టుబాటు కాకున్నా ఈఏడైనా కలిసొస్తుందనే ఆశతో మండలంలో పలువురు రైతులు మిరప సాగు చేపట్టారు. గతేడాదితో పోలిస్తే 40 శాతం సాగు తగ్గిందని గణాంకాలు చెబుతున్నాయి. రెండ్రోజులుగా మండలంలో మిరప నారు నాటే పనులు మొదలయ్యాయి. కొన్నిచోట్ల రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. మిరప నారు నాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కేవీకే మల్యాల కోఆర్డినేటర్ డాక్టర్ సీతాలం మాలతి సవివరించగా వివరించారు.

- ఆరోగ్యకరమైన, దృఢమైన నారు ఎంపిక చేసుకోవాలి. ఎంచుకున్న నారులో చీడపీడలు, నిమటోడ్స్ లేకుండా చూసుకోవాలి.
- నారును నాటు వేయడానికి ముందు 20 లీటర్ల నీటికి 400 గ్రాముల చొప్పున అజోస్పెరిల్లమ్, 400 గ్రాముల పాస్ఫో బ్యాక్టీరియా కలిపి నారును 10–20 నిమిషాలపాటు అందులో ఉంచి నాటాలి. లేదా లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, ఇమిడాక్లోప్రిడ్ 2 మిల్లీలీటర్లు కలిపి మిరప నారును నీటిలో 20 నిమిషాల పాటు వేర్లు మునిగేలా ఉంచి నాటాలి.
- భూసార పరీక్షల ఆధారంగా ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు వేయాలి. పచ్చిరొట్ట పైరు వేసిన రైతులు దాన్ని భూమిలో కలియదున్ని పూర్తిగా మగ్గిన తర్వాతే మిరప నారు నాటాలి.
- ఆఖరి దుక్కిలో తప్పనిసరిగా ఎకరాకు 20 కిలోల చొప్పున వేపపిండి వేయాలి.
- గట్ల వెంట కలుపు లేకుండా చూడాలి. ఎరపంటలుగా ఆముదం, బంతి మొక్కలు నాటాలి.
- జింక్ లోపమున్న భూముల్లో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ భూమిలోనే వేయాలి.
- భాస్వరం మొత్తాన్ని సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో భూమిలోనే ఆఖరి దుక్కిలో వేయాలి.
- నీటి వసతి కింద సాగు చేసే రైతులు ఎకరా భూమికి 120:24:48 కిలోల నత్రజని, భాస్వరం పొటాష్ ఎరువులు భూమిలో వేయాలి.
- నత్రజని ఎరువును పంట పూర్తి కాలంలో 5 దఫాల్లో వేయాలి.
- మిరప అధిక తేమ, బెట్టను తట్టుకునేలా తగినంత నీటిని ఎక్కువ సార్లు అందించాలి.



ఏపుగా పెరిగిన మిరప నారు



మిరప నారు నాటుతున్న కూలీలు

ప్రజాచైతన్యమే కవితల ధ్యేయం

● ప్రముఖ కవి అన్వర్



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న అన్వర్

నెక్కొండ : సమస్యలపై ప్రజలను చైతన్యవంతం చేయడమే కవితల ధ్యేయమని ప్రముఖ కవి అన్వర్ తెలిపారు. మండల కేంద్రంలో ప్రముఖ కవి రాపాక శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పాఖాల కవి సమ్మేళనానికి అన్వర్ హాజరై మాట్లాడారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. శ్రమజీవుల, సమాజంలోని సమస్యలను కవులు అధ్యయనం చేసి పరిష్కార దిశగా ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసే దిశగా కవితలు ఉండాలన్నారు. సమ్మేళనంలో సమతా భావనలు వెల్లివిరిశాయని తెలిపారు. శ్రీనివాస్ రాసిన కవితలను కవులు తమదైన శైలిలో బహు చక్కగా సమీక్షించారని చెప్పారు. కవితలు కవుల శాస్త్రీయ, ఆధునిక, సామాజిక స్పృహ, నిబద్ధతకు అద్దం పడుతున్నాయని చెప్పారు. ప్రశ్నించే తత్వంతోపాటు గళాన్ని వినిపించాలని సూచించారు. కవి సమ్మేళనం లక్ష్యాలు, ఉద్దేశ్యాలను ప్రముఖ యువ కవి బండారు రాజ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో కవులు శిల్పా జగదీశ్, యాకూబ్‌రెడ్డి, లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్, కవులు డాక్టర్ హరీశ్ కుమార్, చిట్ల ప్రేమ్ కుమార్, వడ్లకొండ దయాకర్, కల్యాణి కుంజ, ఎలికట్టె శ్రీనివాస్, నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక పాలనపై పోరాటం తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

● ‘జాగృతి’ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై పోరాటం తప్పదని తెలంగాణ జాగృతి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి తెలిపారు. తెలంగాణ జాగృతి యువజన విభాగం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు తడిగొప్పుల మల్లేశ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి శివారెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతను విస్మరించిందని విమర్శించారు. నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు స్కూటీలు, తదితర అనేక హామీలతో ఓట్లు దండుకుని గద్దెనెక్కిందని గుర్తు చేశారు. రైతులకు సరైన సమయంలో యూరియా అందించడం లేదన్నారు. అన్ని వర్గాలనూ మోసం చేస్తున్న కాంగ్రెస్ పాలనపై యువత చైతన్యవంతం కావాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్వాల జితేందర్ ప్రజాపతి, నూనావత్ రవిరాథోడ్, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు వంశీ, రాజు, నవీన్, సురేశ్, పూర్ణచందర్, శరత్, ఖాజా, మణికంఠ, పాషా, అభిలాశ్, రాకేశ్, వినోద్, పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట

● ఎస్సై ముత్యం రాజేందర్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రాజేందర్

రాయపర్తి : సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. మండలంలోని మైలారంలో గ్రామస్తులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసు శాఖ అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. నిత్యం పహారా కాస్తోందన్నారు. అయినా నేరాలు జరుగుతున్నాయని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. నేర రహిత సమాజ నిర్మాణం దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ఎస్సై సూచనకు గ్రామస్తులు స్పందించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.2 లక్షలు సమకూర్చారు. దాతలను ఎస్సై అభినందించారు. కార్యక్రమంలో లేతాకుల యాదవరెడ్డి, ఈదులకంటి మహిపాల్ రెడ్డి, యాకూబ్‌రెడ్డి, బోయిని కుమార్, యాదగిరి, పరుపాటి మహేందర్‌రెడ్డి, సోమయ్య, పోలీసు సిబ్బంది తూళ్ల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

పర్వతగిరి: వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రాజ గోపాల్ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై బోగం ప్రవీణ్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల ఉత్సవ కమిటీల నిర్వాహకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. వినాయకుడి విగ్రహాల ఏర్పాటును పోలీస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. నిబంధనలు పాటించాలని చెప్పారు. విగ్రహాల వద్ద విద్యుత్ వైర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనంలో పాల్గొనే నిర్వాహకులు, భక్తులు మద్యం మత్తులో ఉండొద్దని స్పష్టం చేశారు. ఎస్సై ప్రవీణ్ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఉత్సవాల సందర్భంగా డీజే సౌండ్స్ నిషేధమని, బాణాసంచాలు కాల్చే విషయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

కొనసాగుతున్న ప్రతిష్టంభన

గీసుకొండ : ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతోంది. ఆదివారం వరంగల్ రైల్వే స్టేషన్‌వద్ద గూడ్స్ షెడ్ నుంచి సుమారు 42 బాక్సుల సరుకులను దిగుమతి చేసి సంబంధిత ప్రదేశాలకు తీసుకుని వెళ్లడానికి కొండా, రేవూరి వర్గాలవారి లారీలు వెళ్లాయి. కొండా వర్గానికి చెందిన డీసీఎం వాహనాల్లో సరుకులను తరలించే విధంగా కాంట్రాక్టర్ వ్యవహరించారని ఫిరోజ్ అలీ (రేవూరి)వర్గం వారు ఆరోపిస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం ఏనుమాముల మార్కెట్ వద్ద లారీలు బుకింగ్ విషయమై అనౌన్స్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి న్యాయం చేస్తామని చెప్పడంతో ఫిరోజ్ వర్గం వారు శాంతించారు. ఈ సందర్భంగా గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఫిరోజ్ అలీ వర్గం నాయకులు సమావేశమయ్యారు. అసోసియేషన్ విషయంలో నెలకొన్న వివాదం సెటిల్ చేస్తానని, ఓ నాయకుడు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, తాము నిరాకరించినందుకు ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు.

ఆర్థికసాయం

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు మౌలానా తండ్రి రసూల్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు రూ.17800 సాయం అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, మాజీ వార్డు మెంబర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నాచినపల్లిలో..

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన గుండెబోయిన రాజు బ్లడ్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుండగా వైద్యం కోసం ఆయనకు పదో తరగతి నాటి మిత్రులు రూ.20 వేల సాయం అందించారు. అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో రాజు స్నేహితులు శ్రీనివాస్, బండారు శివకుమార్, రవికుమార్, ముల్క రమేశ్, పుట్టపాక రవీందర్, రాజు, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



దుగ్గొండి : బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని దేశాయిపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కొల్లూరి రాజు, భట్టు రవి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో ఆదివారం చేరగా వారికి మాజీ ఎమ్మెల్యే పెద్ది కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పెద్ది మాట్లాడారు. యూరియా కోసం అన్నదాతలు అల్లాడుతున్నారని తెలిపారు. రైతుల కష్టాలు తీర్చలేని అసమర్థ ప్రభుత్వం పాలన సాగిస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి మంజూరైన రోడ్లను రద్దు చేయించి అభివృద్ధిని అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు అభివృద్ధికి దూరమయ్యాయని ఆందోళన వెలిబుచ్చారు. కాంగ్రెస్‌కు తగిన రీతిలో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు మేర్గు రాంబాబు, మోర్తాల రాజు, కిషన్, నల్లబెల్లి శోభన్, రవీందర్., పోశాలు, తదితరులు పాల్గొన్నారు.



సంగెం : పార్టీలో చేరిన వారితో ధర్మారెడ్డి

బీఆర్‌ఎస్ హయాంలోనే సుపరిపాలన

సంగెం : బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని నల్లబెల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు పెండ్లి సురేశ్, పెండ్లి రాకేశ్ బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ధర్మారెడ్డి కండువా కప్పి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే సుపరిపాలన అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, మల్లయ్య, సాగర్‌రెడ్డి, కుమారస్వామి, రాజు, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

‘సింహగర్జన’తో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

● ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ విశ్వనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

రాయపర్తి : సెప్టెంబర్ 9న సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న సింహగర్జన సభను విజయవంతం చేసి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. మండలంలోని కొండూరు, కాట్రపల్లి గ్రామాల్లో పెన్షనర్లతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్ పెంచుతామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి ఓట్లు దండుకుని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తదనంతరం హామీని విస్మరించిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి 21 నెలలు గడుస్తున్నా పింఛన్ పెంపు దిశగా చేసిందేమీ లేదన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువుల వేదనకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మంద కృష్ణ చలించి ఉద్యమ దిశగా కార్యాచరణకు రూపకల్పన చేశారని చెప్పారు. ఖచ్చితంగా పింఛన్ పెంపు సాధించుకుంటామని తెలిపారు. సింహగర్జన సభకు మండలంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జి వశపాక కుమార్, శ్రీనివాస్, రమేశ్, రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

‘పాపన్న స్ఫూర్తితో బహుజనులు సత్తాచాటాలి’

నర్సంపేట : సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో బహుజనులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని పాపన్న విగ్రహ కమిటీ అధ్యక్షుడు సోల్తి సారయ్య, ప్రధాన కార్యదర్శి అనంతుల రమేశ్ ఆకాంక్షించారు. పట్టణంలో పాపన్న 375వ జయంతి వేడుక ఆదివారం నిర్వహించారు. పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సారయ్య, రమేశ్ మాట్లాడారు. క్షత్రియ వంశస్తులే రాజులయ్యే తరుణంలో సామాన్యుడు, గీత కార్మిక కుటుంబానికి చెందిన పాపన్న 33 కోటలను జయించి వీరుడిగా చరిత్రలో నిలిచాడని గుర్తు చేశారు. పాపన్న బహుజనులందరికీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచాడని తెలిపారు. పాపన్న చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చంతోపాటు అసెంబ్లీ, పార్లమెంట్ హాళ్లలో ఆయన చిత్రపటం ఉంచి గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ కోశాధికారి ఊడ్గుల శ్రీనివాస్, నాయకులు గండి లింగయ్య, మాచర్ల ఐలుమల్లు, నాగెల్లి వెంకటనారాయణ, కోల వెంకటేశ్వర్లు, ఆరెల్లి శ్రీనివాస్, గోపగాని వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

● బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సూరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సూరయ్య

నెక్కొండ : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత నెలకొందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు అనాలోచిత విధానాలు అవలంబిస్తుండడంతో ఖరీఫ్‌లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పీఏసీఎస్ చైర్మన్ మారం రాము మాట్లాడారు. గడచిన పదేళ్లలో యూరియా కొరత లేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రైతులను, ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు కొమ్ము రమేశ్, పట్టణ అధ్యక్షుడు కొనిజేటి భిక్షపతి, నాయకులు బొల్లెబోయిన వీరస్వామి, ఈదునూరి యాకయ్య, దేవనబోయిన వీరభద్రయ్య, కారింగుల సురేశ్, గడ్డం రమేశ్, చరణ్, వంశీకృష్ణ, నరేశ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

‘జైలు అధికారులపై అట్రాసిటీ కేసు పెట్టాలి’



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న రాజేందర్

నర్సంపేట : నర్సంపేట సబ్ జైలులో అనుమానాస్పద స్థితిలో పెండ్యాల సుచరిత మృతి చెందిన నేపథ్యంలో జైలు అధికారులపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగి ఎలేందర్, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుచరిత కుటుంబాన్ని వారు ఆదివారం పరామర్శించారు. సుచరిత మృతిపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎలేందర్, రాజేందర్ మాట్లాడారు. ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

జైలర్‌పై చర్యలు తీసుకోవాలి

పెండ్యాల సుచరిత అనుమానాస్పద మృతి నేపథ్యంలో నర్సంపేట సబ్ జైలు జైలర్‌పై చర్యలు తీసుకోవాలని బహుజన్ రాజ్యాధికార పార్టీ (బీఆర్‌పీ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘటనపై విచారణ జరిపించి బాధ్యులందరిపైనా చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

‘స్థానికం’లో వామపక్షాలతో కలిసి పోటీ

● ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

దుగ్గొండి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వామపక్ష పార్టీలతో కలిసి పోటీ చేస్తామని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. మండలంలోని గిర్నిబావిలోని ఓ ఫంక్షన్ హాలులో సింగతి మల్లికార్జున్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల కమిటీ విస్తృత సమావేశానికి రమేశ్ అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాప్యంతో పల్లెల్లో, పట్టణాల్లో సమస్యలు పేరుకుపోయి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయని పరిస్థితుల్లో స్థానిక సంస్థలు నిర్వీర్యం అయ్యే పరిస్థితులు దాపురించాయని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు, డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజా, నాయకులు నాగెల్లి కొమురయ్య, ఎల్లబోయిన రాజు, గటిక జమున, బుడిమె సురేందర్, బత్తిని కుమారస్వామి, గీసపాక కొమురయ్య, గాంధీ, కుమారస్వామి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

దసరా నుంచి ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

వర్ధన్నపేట : దసరా (అక్టోబర్ 2వ తేదీ) నుంచి ఏడాది పాటు రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) సంఘ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తామని తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ జీ తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వర్ధన్నపేట, రాయపర్తి మండలాల సర్వ స్వయం సేవకుల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా అన్ని గ్రామాల్లో పూర్తి ఘన పద వేశ్‌తో పాల్గొనాలని స్వయం సేవకులకు సూచించారు. ఖండ స్థాయిలో పద సంచలన రూట్ మార్చ్ నిర్వహించాలని చెప్పారు. అన్ని గ్రామాల్లోనూ శాఖలను విస్తరించాలని, జన జాగరణ సంఘం సేవలను ఇంటింటికీ తీసుకెళ్లి సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఫొటోలు, కరపత్రాలు, స్టిక్కర్లు,, పుస్తకాలను అందజేయాలని తెలిపారు. హిందూ, యువ, ప్రతిష్టిత వ్యక్తులతో సమ్మేళనాలు నిర్వహించి సమాజంలో చైతన్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. సమావేశంలో వరంగల్ విభాగ్ సహ కార్యవాహ విస్తార్ జీ, వరంగల్ గ్రామీణ జిల్లా కార్యవాహ గడ్డం సురేందర్, తదితరులు పాల్గొన్నారు.